క్లుప్తంగా

ఉచితంగా నట్టల నివారణ మందు



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న కొణిదేల పశు వైద్యాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: ఉచితంగా దూడలకు, గేదలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు, వ్యాధి నిరోధక టీకాలు వేస్తునట్లు కొణిదేల పశు వైద్యాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు, టీకాలు వైద్యులు వేశారు. ఆయన మాట్లాడుతూ గేదలకు, ఆవులకు చూడీ పరీక్ష నిర్ధారణ, గర్భకోస వ్యాధులకు చికిత్సలు అందించామన్నారు. అనారోగ్యంతో ఉన్న పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రాఘవేంద్ర, రాంచరణ్‌తేజ, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు రూరల్: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో హెల్మెట్ ధారణపై మహిళా పోలీసు మైమున్నీసా బేగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తలకు రక్షణగా హెల్మెట్ వాడకంతప్పనిసరి అని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణ, డీలర్ ఎస్తేరయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: ఒత్తిళ్లకు తలొగ్గకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్‌ఐ తిరుపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు ముందుగా కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవాన్ని నిర్వహించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన రాగసుధ డ్యాన్స్ అకాడమీ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వినాయక కౌత్వం, శివస్తుతి, నటేశకౌత్వం, శివ శివ శంకరా, నమఃశివాయతే తదితర గీతాలకు ప్రవళిక, బిందు, అద్వైత, నవ్య, వర్షిక, శరణ్య, లక్ష్య, శ్రీనిఖ, చైత్ర, లలిత తదితరులు నృత్యప్రదర్శన ప్రదర్శించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్‌ను నాక్ బృందం శుక్రవారం ప్రకటించింది. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ పీఆర్ టీం సభ్యులు విశ్రాంత ఉపకులపతి డాక్టర్ రాజేష్ కుమార్ సింగ్ దాకారే ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియం, డాక్టర్ పీకే రాజేష్‌లతానే త్రిసభ్య కమిటీ నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఇటీవల సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ రావడం సంతోషకరమన్నారు. భవిష్యత్‌లో మరింత ఉత్తమ గ్రేడ్ కోసం అధ్యాపక బృందం, సిబ్బందితో కలిసి ప్రయత్నిస్తామన్నారు.

డెలివరీ పరికరాలు మంజూరు చేస్తాం

- ప్రతి పీహెచ్‌సీలో నెలకు ఐదు ప్రసవాలు చేయాలి
- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

సాక్షి ఎఫెక్ట్



జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో ప్రసవాలు ఎందుకు చేయటం లేదని డాక్టర్ గంగాధర్‌ను ప్రశ్నిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



పారుమంచాలలో ఓ ఇంటి ముందు నిల్వ ఉన్న నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, డాక్టర్ యశశ్విని

జూపాడుబంగ్లా: ఆస్పత్రుల్లో ప్రసవం చేయడానికి కావాల్సిన పరికరాలు మంజూరు చేస్తామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో ప్రసవాలు చేయకపోవడాన్ని ఎత్తు చూపుతూ గురువారం 'ప్రసవవేదన' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం పారుమంచాల, జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. పారుమంచాల పీహెచ్‌సీలో ప్రతి నెల తప్పనిసరిగా ఐదు ప్రసవాలు చేయాలని డాక్టర్ యశశ్వినికి సూచించారు. కుష్టు వ్యాధి సర్వే, ఎన్‌సీడీ 3.0, ఎల్‌సీడీసీ సర్వేలను వేగవంతం చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించి ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూపాడుబంగ్లా పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన ప్రసవాలు ఎందుకు చేయటం లేదని డాక్టర్ గంగాధర్‌ను ప్రశ్నించారు. ప్రసవాలు చేయటానికి సిబ్బంది ఉన్నా సరైన పరికరాలు లేవని డాక్టర్ వివరించడంతో అవసరమైన టేబుల్, పరికరాలను మంజూరు చేయిస్తానని డీఎంఅండ్‌హెచ్‌ఓ హామీ ఇచ్చారు. పరికరాలు వచ్చిన తర్వాత ప్రసవాలు చేయకుండా నిర్లక్ష్యంగా వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. నైట్‌డ్యూటీకి అవసరమైన స్టాఫ్‌నర్స్ నియమిస్తామన్నారు. చెకింగ్ నిమిత్తం పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులకు సుఖప్రసవాలపై అవగాహన కల్పించి స్థానిక పీహెచ్‌సీలోనే ప్రసవం పొందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌ను ఆదేశించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సీహెచ్‌ఓ వహాబ్ ఎక్కడున్నారని డాక్టర్ గంగాధర్‌ను డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రశ్నించగా ఫీల్డ్‌కు వెళ్లినట్లు తెలిపారు. వాస్తవానికి సీహెచ్‌ఓ విధులకు హాజరుకాకుండా ఓ రోజు ముందుగానే హాజరు వేసుకున్నట్లు వైద్యసిబ్బంది గుసగుసలాడటంతో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీహెచ్‌ఓపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రెండు పీహెచ్‌సీల్లో మాత్రమే ప్రసవాలు జరగటం లేదు

జూపాడుబంగ్లా, పారుమంచాల పీహెచ్‌సీలను పరిశీలించిన అనంతరం జిల్లా వైద్యాధికారి విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలుండగా జూపాడుబంగ్లా, దీబగుండ్ల పీహెచ్‌సీలలో మాత్రమే ప్రసవాలు జరగడం లేదన్నారు. దీబగుండ్ల పీహెచ్‌సీ అద్దె భవనంలో ఉండటం, జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో పరికరాల్లేని కారణంగా ప్రసవాలు జరగడం లేదన్నారు. జూపాడుబంగ్లా పీహెచ్‌సీకి పరికరాలు మంజూరు చేసి సత్వరమే ప్రసవాలు జరిగేలా చూస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 86 మంది కుష్టువ్యాధిగ్రస్తులున్నట్లు తెలిపారు. వారికి ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో అవసరమైన మందులు అందజేస్తామన్నారు. ఆయన వెంట అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదా బాయి ఉన్నారు.

3 నుంచి సున్నిపెంటలో సర్వే

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో 3వ తేదీ నుంచి వారం రోజులపాటు సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సచివాలయ, జలవనరుల శాఖ సిబ్బందితో ఎవరెవరు ప్రభుత్వ గృహాలు, స్థలాలపై యాజమాన్య హక్కులు కలిగి ఉన్నారని, ఎవరెవరికి రిజిస్ట్రేషన్లు చేయించాలని అంశాలపై సర్వే చేయించారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా మరోసారి సర్వే నిర్వహించేందుకు సచివాలయాల వారీగా 13 మంది సిబ్బందిని నియమించినట్లు సమాచారం. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సర్వేలు చేస్తున్నారే తప్ప యాజమాన్యహక్కులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

విద్యుదాఘాతంతో మంటలు

నందికొట్కూరు: పట్టణంలోని బీఎస్ఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న దూదేకుల షకినా, ఇస్మాయిల్ దంపతుల ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. శుక్రవారం భార్య, భర్త ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఉదయం 10 గంటల సమయాంలో ఇంట్లో నుంచి పొగలు వస్తుండటంతో చుట్టు పక్కల వారు గమనించి సచివాలయం ఉద్యోగులకు సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేశారు. కాగా అప్పటికే ఫ్రిజ్, కూలర్, టీవీ, బీరువా, దుస్తులతో పాటు సామగ్రి కాలిపోవడంతో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

నాలుగు గంటలు పని చేయాలి



కూలీల మస్టర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: ఉపాధి కూలీలు కనీసం నాలుగు గంటలు పని చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి, కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనికి వెళ్లిన వెంటనే ఒకసారి పూర్తయిన తర్వాత రెండో సారి ఫొటోలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. లేకపోతే పనులకు హాజరు కానట్లేనన్నారు. కూలీలు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కొత్త జాబుకార్డు కావాలనుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మస్టర్లలో హాజరు వేయడంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని మేటీలకు సూచించారు. జాబు కార్డు కలిగి అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. ఆమె వెంట ఏపీఓ హరికృష్ణ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారథి, ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

నందికొట్కూరు: నెల్లూరు జిల్లాలో 1, 2, 3వ తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వర రావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతాంగ, కౌలు, వ్యవసాయ కార్మికులు, సామాన్య మధ్యతరగతి, ప్రజల సమస్యలపైన, ఇంటి స్థలాల కోసం నిరంతరం పోరాటం చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పూరి గుడిసెలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆయా కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, కర్ణ, ఓబులేసు, బాబు, ఉస్మాన్‌బాషా, బాలయ్య పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు

ఆత్మకూరు: క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు అన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్, కేవీకే స్టేడియంలో శనివారం జరిగిన జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆత్మకూరు క్రీడాకారులకు పుట్టినిల్లు అన్నారు. క్రీడాకారులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

నందికొట్కూరు: రాష్ట్రంలో టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ శుక్రవారం పటేల్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే 50 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలలతో పాటు మిగిలిన అన్ని పాఠశాలలను కొనసాగించాలని కోరారు. ధర్నాలో డీటీఎఫ్ జిల్లా నాయకులు కిశోర్, ఆంజనేయులు, స్వామి శేఖర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమ్మ, రెడ్డి, అర్య, వైశ్య, క్షత్రియ, బ్రా హ్మణ, కాపు(కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కార్పొరేషన్లకు సంబంధించి లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా సబ్సిడీ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న బీసీలు, 21 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న కాపులు అర్హులన్నారు. ఫిబ్రవరి 7వ తేదీలోగా https//apobmms. apcffs.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

– డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

వెలుగోడు: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని వేల్పనూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్ జహీర్‌వలి గుంతకందాల గ్రామానికి ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారని సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ పీహెచ్‌సీలో సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందాయన్నా రు. మరోసారి ఫిర్యాదులు రాకుండా విధు లు సక్రమంగా నిర్వహించాలన్నారు. మరిన్ని వివరాలను వైద్యాధికారి ప్రణీత్‌ను అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా: స్వయం ఉపాధి పథకాల కోసం ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి ఏడో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, బలిజ, తెలగ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు కులధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్‌కార్డు, జిరాక్సు కాపీలను జతపరచి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కొత్తపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు. మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన ఈడిగ చంద్రగౌడ్ ఆత్మకూరులోని ఓ వైన్‌షాపు నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, వాటిని కొత్తపల్లి మీదుగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎం.లింగాపురం గ్రామం ఆటోస్టాండ్ వద్ద నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీ నిర్వహించగా 8 మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఈఓ శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. వసతి గృహాలలో సేదతీరే భక్తుల కోసం దుప్పట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటర్ లీకేజీ కాకుండా మరమ్మతులు చేపడుతున్నామన్నారు. శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు మొరాయింపు

జూపాడుబంగ్లా: ఆర్టీసీ నందికొట్కూరు డిపో బస్సు పారుమంచాల వద్ద మొరాయించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విధులకు సమయం ఆసన్నం కావటంతో వారు మరింత ఉద్వేగానికి గురయ్యారు. కాలం చెల్లిన బస్సులను పక్కకుపెట్టి కండీషన్‌లో ఉన్నవాటినే తిప్పాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

వినియోగదారుల కేంద్రాన్ని కొనసాగించాలి

ఆత్మకూరు: విద్యుత్ బిల్లుల చెల్లింపు వినియోగదారుల కేంద్రాన్ని పట్టణంలో కొనసాగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాన్ని కొనసాగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రెండు, మూడు రోజుల్లో పునరుద్ధరిస్తామని చెప్పి దాదాపు 15 రోజులు అవుతున్నా అతీగతీ లేదన్నారు. పట్టణంలో 60 వేల జనాభా, 15 వేల కుటుంబాలు, గృహ, వ్యాపార, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 18 వేలకు వరకు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా స్థానికంగానే కేంద్రాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర పాల్గొన్నారు.

దిగుబడుల ఆధారంగా పంటబీమా



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పంట కోత ప్రయోగంలో వచ్చిన దిగుబడి ఆధారంగా శనగకు పంట బీమా వర్తిస్తుందని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రణాళిక అధికారి వేణుగోపాల్ రైతులకు చెప్పారు. నంద్యాల మండలం మూలసాగరం గ్రామంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద యూనిట్ నెంబరు 64లో స్థానిక రైతు వీరారెడ్డి పొలంలో శుక్రవారం శనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు దశల్లో పంట కోత ప్రయోగం నిర్వహించగా మొదటి దశలో 2.100, రెండో దశలో 1.850, మూడో దశలో 1.470, నాలుగో దశ ప్రయోగంలో 1.350 కిలో గ్రాములు దిగుబడులు వచ్చాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు పంట కోత ప్రయోగాలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ రమణయ్య, ఏఎస్‌ఓ ప్రహ్లాద, ఏఈఓ రవికుమార్, ఎంపీఈఓ ఇంద్రాణి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి



లేగదూడల పెంపకం దారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): లేగదూడల పెంపుపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఏహెచ్‌ఓ గోవిందనాయక్ సూచించారు. రైతునగర్‌లో శుక్రవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 40 లేగదూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీఏఎంఓ మాట్లాడుతూ లేగదూడలు ఆరోగ్యంగా, బలంగా ఉండేందుకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం లేగదూడల పెంపకం దారులు అయిన 30మంది రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ వెంకటసుబ్బారెడ్డి, కానాల పశువైద్యాధికారి శ్రీనివాసులు, హరిబాబు చౌదరి, మధు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు ఆలయాలకు రూ.3 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, మాధవ, గట్ల నరసింహస్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. సుమా రు 18 నెలల కాలానికి సంబంధించి రూ.3,08,683 నగదు, 7.870 గ్రాముల బంగారం వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుగ్గన శ్రీధర్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభను కనబరచడానికి అద్భుతమైన వేదిక




వాలీబాల్ విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

మహానంది: ప్రతిభను కనబరచడానికి క్రీడా పోటీలు అద్భుత వేదిక అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణ సాగర్ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి ఆధ్వర్యంలో మూడో రోజు క్రీడా పోటీలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని, ఆత్మవిశ్వాసం పెంపొందడానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.

విజేతలు వీరే..

క్రీడా పోటీల్లో శుక్రవారం విజేతలను ప్రకటించారు. బ్యాడ్మింటన్, 100 మీటర్స్(గరల్స్), షాట్‌పుట్(గరల్స్) ఊటుకూరు అగ్రి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారు. క్యారమ్స్(బాయ్స్)లో మార్టూరు, చెస్(బాయ్స్) అనకాపల్లి, టేబుల్ టెన్నిస్(బాయ్స్) మడకశిర, లాంగ్ జంప్(గరల్స్) రామగిరి, డిస్కస్ త్రో(గరల్స్) పాదలకూరు, వాలీబాల్‌లో రంపచోడవరం విద్యార్థులు విజయం సాధించారని అసోసియేట్ డీన్ డాక్టర్ వీరజయలక్ష్మి తెలిపారు.


ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం




అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే



పూజలందుకున్న అమ్మవారు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సోదరులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయనకు పురోహితులు, ఆర్యవైశ్య సోదరులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, హారతి, మహిళల ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, మహామంగళహారతి, అమ్మవారికి గుండ ప్రవేశం సందర్భంగా పునఃపూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. క్షీరాభిషేకానికి శ్రీనివాసులు శాశ్వత దాతగా ఉంటూ పాలను సరఫరా చేశారు. అమ్మవారి పవిత్రమైన రోజు కావడంతో పెద్దసంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు.

నందికొట్కూరులో..

నందికొట్కూరు: వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి మాత ఆలయంలో అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పూలతో అలకరించారు. ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ రోజున భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆత్మార్పణ దినం పురస్కరించుకుని అమ్మవారి మూల నామముతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, మెట్ల పూజ చేశారు.

వెలుగోడులో..

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు ఎరుపు రంగు చీరలు ధరించి ఒడి బియ్యం, పంచామృతంతో అమ్మవారి శాలకు చేరుకున్నారు. పురోహితులు ఆమంచి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి మహాగణపతి పూజ, స్వస్తి వాచకం, సామూహిక అభిషేకం, లలితా పారాయణం, అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం, పంచ హారతులతో మహా మంగళహారతి, విశేష పూజలు నిర్వహించారు.

మిడుతూరులో..

మిడుతూరు: స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పన దినం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయంలో వేధపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, హోమం తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన భూమా క్రిష్ణ మోహన్, దొంతు కృష్ణమూర్తి, కటకం వెంకటేశ్వర్లు, గుంతా సూర్యనారాయణ, కటకం సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు భరోసా కల్పించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే గిత్త జయసూర్య



కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

మిడుతూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వారికి భరోసా కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య (వెలుగు) కార్యాలయ ఆవరణంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మిడుతూరు మండలంలో కంది ఎక్కువగా సాగైందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కిలో కందులు రూ.7,550 మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరినాథ్ రెడ్డి, ఏడీఏ విజయశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.